

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయి, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయి... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"లేస్తావా?" అన్నయ్య** గొంతుకి మెలకువ వచ్చింది.

"టైం ఎంత?"

"నాలుగు దాటింది"

"అంతేనా?" ఆశ్చర్యానికి నిద్రమత్తు కాస్త తగ్గింది.

"హైకింగ్‌కి వెళ్దామనుకున్నాముగా?"

"అప్పుడేనా?" బద్దకంగా అడిగాను.

"లే. యూ వోంట్ రిగ్రెట్ దిస్"

కాసేపు అటూ ఇటూ దొర్లి, నిద్రమత్తులోనే తయారయ్యాను. షూస్ వేసుకుని బయటకి వెళ్ళబోతుండగా అన్నయ్య జాకెట్ చేతికిచ్చాడు. నిద్రమత్తులో దాన్ని అందుకుని బయటకి నడిచాను. మెట్లు దిగుతుండగా చల్లటిగాలి నా మొహం పై ఒక్క దెబ్బవేయడంతో పూర్తిగా మేలుకుని జాకెట్ వేసుకుని వెనక్కి తిరిగి అన్నయ్య వైపు చూసాను. ఫోన్‌లో ఏదో చూసుకుంటూ కిందకి దిగడం గమనించి నా ఫోన్ మర్చిపోయానని గుర్తొచ్చింది. కానీ ఇంత పొద్దున్నే నాకు ఎవరూ ఫోన్ చెయ్యరని కారెక్కాను. అన్నయ్య పాటలుకాక రేడియో పెట్టాడు. మన రేడియోలోలాగానే బోలెడు ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ వచ్చాయి. ఆర్ జె మాత్రం వెనకాల ఎవరో తరుముతున్నట్లుగా కాక మామూలుగా, నిదానంగానే మాట్లాడారు. "అర్థమౌతుందా?" అన్నయ్య అడిగాడు.

రూటా, టైమా, రేపు వెళ్ళిపోతున్నాననా? దేని గురించి అడుగుతున్నాడో తెలీలేదు. ఇంత పొద్దున్నే ఎందుకు గోల అని "ఆఁ" అన్నాను.

నా వైపు అపనమ్మకంగా చూసి "అర్థమౌతుందా?" మళ్ళీ అడిగాడు.

"ఆఁ అర్థమౌతుంది" పరధ్యానంగా అన్నాను.

"ఏమన్నాడు?"

"ఎవరు?"

"రేడియోలో ఏక్సెంట్ అర్థమౌతుందా?"

"నేను వినలేదు కానీ అర్థమౌతుంది. పొద్దున్నే ఈ క్విజ్ ఏంటి?" చిరాకు పడ్డాను.

అన్నయ్య నవ్వి "ఎక్కడ ఉన్నామో తెల్సా?" మరో ప్రశ్న అడిగాడు.

చుట్టూ అంతా చీకటి "తెలీదు"

"మనం బ్రంచ్‌కి వచ్చింది ఇక్కడే"

"ఔనా?" చీకటిలో నిర్మానుష్యంగా ఉంది.

అలా చాలాసేపు డ్రైవ్ చేసాక "వచ్చేసాం" అన్నాడు.

"కారులో వెయిట్ చేద్దామా?"

"దేనికి?"

"అంతా చీకటిగా ఉందిగా"

పెద్దగా నవ్వి "పద" కారు దిగాడు.

"జాగ్రత్త. నా పక్కనే నడువు" అన్నాడు.

అన్నయ్య, నేను కాసేపు నడిచాక నెమ్మదిగా సూర్యోదయం అయ్యింది. అలసట వల్ల కాసేపు ఆగాను. ఇంతలో వెలుతురు కూడా పెరిగింది. చుట్టూ నది, చెట్లు, ఎదురుగా మంచు పర్వతాలు. నీళ్ళు ఆకాశం రంగులో, చెట్టుకున్న ఆకులు పసుపు పచ్చ రంగులో ఉన్నాయి. ఆ అందం వర్ణించగలిగేది కాదు. అక్కడ ఎంతసేపు ఆగి ప్రకృతిని ఆశ్వాదించానో తెలియదు కానీ, ఎంతో ప్రశాంతంగా అనిపించింది. వెనక్కి నడుస్తుండగా ఇంత అద్భుతమైన ప్రదేశంలో నడిచానా అని ఎంతో ఆశ్చర్యపోయాను.

"అలసిపోయావా?" అన్నయ్య అడిగాడు.

"లేదు" ఇద్దరం కారెక్కాము.

"ఆకలేస్తుందా?"

"కొంచెం వేస్తుంది"

"తిందాం పద" కారు పార్క్ చేసాడు.

"అప్పుడే వచ్చేసామా?"

"యా. నిన్ను సూపర్ డూపర్ రెస్టారెంట్‌కి తీసుకెళుతున్నా. ఇది చాలా ఎక్స్‌పెన్సివ్. నేను ఒక్కసారి మాత్రమే వచ్చా. వెజ్ ఆప్షన్స్ బానే ఉన్నాయి."

రెస్టారెంట్ అంతా అద్దాలగోడ. లోపలనుండి చెట్లు, పర్వతాలు కనబడుతున్నాయి. ఎంతో ఎత్తులో కట్టినట్లుగా అనిపించింది. టేబుల్స్ మీద ఆరెంజ్, తెలుపు, పింక్ రంగు పువ్వులు ఉన్నాయి. అలాగే రెండు జతల గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు అన్నీ అమర్చి ఉన్నాయి.

"బయట కూర్చుందామా?" లోపల కూర్చుందామా?" అడిగాడు.

"లోపల"

అద్దం పక్కనే ఉన్న టేబుల్ దగ్గరకి వెయిట్రెస్ మమ్మల్ని తీసుకెళ్ళింది.

"రెండు గ్లాసులెందుకున్నాయి?" అన్నయ్యని అడిగాను.

"ఒకటి వైన్ గ్లాస్, ఒకటి నీళ్ళ గ్లాస్"

మెన్యూలో చూస్తే అన్నయ్య చెప్పినట్టే ధరలు ఎక్కువగా ఉన్నాయి. తాగడానికి అన్నయ్య కాఫీ, నేను నీళ్ళు తీసుకున్నాము.

"ఏం తింటావు?" అన్నయ్యని అడిగాను.

"షకూష్కా"

"అంటే?"

"అది ఆఫ్రికెన్ డిష్. ఎగ్స్‌తో చేస్తారు. కారంగా బావుంటుంది"

"నేనేం తీస్కోను?"

"నీ ఇష్టం. బేల్, ఓట్‌మీల్ లాంటివి కాకుండా ఎక్కువ క్వాటింటీ ఉన్నవి తీస్కో"

"సరే" మెన్యూలో వెజిటేరియన్ పేజీ తిప్పి చూడసాగాను. అన్నిటికన్నా తక్కువ ధర ఉన్నది 26డాలర్లు. నా ఆలోచన వినబడినట్టే "రేట్ చూడకు. ఇవాళ నీ లాస్ట్‌డే ఇక్కడ. సుబ్బరంగా ఏది కావాలంటే అది తీసుకో" అన్నాడు.

"బెర్రీ సూఫ్లే అంటే?"

"బెర్రీస్, ఎగ్ వైట్స్‌తో చేస్తారు. దాంతోపాటు ఇంకేమైనా తీసుకో. అదొక్కటే సరిపోదు"

"టర్కిష్ మెనిమెన్ తీస్కోనా?"

"యా. అది నేను ఆర్డర్ చేసేలాంటిది. స్క్రామ్‌బుల్డ్ ఎగ్స్‌తో చేస్తారు."

వెయిట్రెస్ వచ్చాక ఆర్డర్ చేసి ఎంతసేపు కూర్చున్నా ఆవిడ తిరిగి రాలేదు. ఆకలి ప్రతిసెకెండ్‌కి పెరుగుతూనే ఉంది. "ఇంకా ఎంతసేపు?" అన్నయ్యని అడిగాను.

"వచ్చేస్తుంది. ఆగు"

ఆకలి పెరిగి పెరిగి చివరికి చచ్చింది. అదే సమయానికి మా ఆర్డర్‌ని టేబుల్ మీద పెట్టారు. తినగలిగినంత తిందాం అని ఫోర్క్ చేతిలోకి తీసుకున్నాను.

''రుచి చూస్తావా?'' అన్నయ్య అడిగాడు.

''ఆఁ నువ్వు కూడా నాది ట్రై చెయ్యి'' అన్నయ్య దాంట్లోంచి ఒక స్పూను తీసుకున్నాను. బాగా నీరుగా ఉంది. ఎగ్ కూడా పూర్తిగా వండకుండా పచ్చిగా ఉంది.

''అదేంటి? నీ ఎగ్ ఉడకలేదు'' అన్నాను.

''ఇది పోచ్డ్ ఎగ్. ఇలానే ఉంటుంది. ట్రై చెయ్యి''

జీవితంలో మొట్టమొదటిసారి పచ్చి ఎగ్ తిన్నాను. నోరంతా వికారంగా అయ్యింది.

''బాలేదు''

''నీది నచ్చిందా?''

''ఆఁ నాది బానే ఉంది.''

''అది చాలులే తిను''

ఆశ లావు, పీక సన్నంలా కొంచెం తినగానే కడుపు నిండిపోయింది. ''ఎక్కువైంది'' అన్నాను.

''నేను తినేంతసేపు తిను. బెర్రీ సూ ఫ్లే కూడా ఉంది ఇంకా''

బెర్రీ సూఫ్లే పుల్లగా బావుంది కానీ పూర్తిగా తినలేకపోయాను. ఇంటికి తీసుకెళ్ళేంత లేకపోవడంతో అన్నయ్య పూర్తిచేసాడు. బిల్లు చెల్లించి, టుగో బాక్స్ తీసుకుని ఇంటికి బయలుదేరాము. పొద్దున చీకటిలో చూసిన రోడ్డుని వెలుతురులో చూడసాగాను. ఇల్లు చేరేసరికి మధ్యాహ్నం రెండయ్యింది.

నేను, అన్నయ్య ఇద్దరం కలిసి నా సూట్‌కేసులు సద్దడం మొదలుపెట్టాము. ఇంతలో ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్ వాళ్ళు ఎయిర్‌పోర్ట్ నుండి ఎవరు పిక్ చేసుకుంటారు, వాళ్ళ నంబరు పంపారు. అది అన్నయ్యకి ఇచ్చి అన్నయ్య నంబరు వాళ్ళకి పంపాను.

ఇంతలో దిగులు మొదలైంది. అన్నయ్యకి నేను వెళ్ళిపోతున్నానని కొంచెం కూడా దిగులు లేదనిపించి బాగా కోపం వచ్చింది. ఆ రెండూ కలిసి ఆపుకోలేనంత దుఃఖం కలిగింది. బాత్ రూంలోకి వెళ్ళి భోరున ఏడ్చాను. ఎంతసేపు ఏడ్చినా ఏడుపు ఆగలేదు. అన్నయ్య తలుపు తట్టి, ''అరిసెలు తీసుకెళ్తావా?'' అడిగాడు.

కళ్ళు తుడుచుకుని ''ఒద్దు'' అన్నాను. అద్దంలో చూస్తే నా కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చాలాసేపటి తరవాత ఓ కుదుటికి వచ్చాను. పాకింగ్ పూర్తిచేసి సూట్‌కేస్‌ల వెయిట్ చెక్ చేసేసరికి సాయంత్రం అయ్యింది. ఆకలి అవడంతో త్వరగా డిన్నర్ చేసి జంధ్యాల సినిమా చూస్తూ స్లీపీ టైం టీ తాగాము.

''నీ సూట్ కేస్‌లో ఒక టీ డబ్బా పెట్టాను. రోజూ రాత్రి తాగు. అయిపోయాక ఇంకోటి కొనుక్కో. జాగ్రత్తగా ఉండు. నీ రూం మేట్స్ ఎవరైనా నీ వస్తువులు వాడితే గొడవ పడకు. కానీ నువ్వు ఎవరివీ వాడకు. మరీ అవసరం వస్తే వాళ్ళకి చెప్పి వాడు. కుదిరినప్పుడు వెంటనే తిరిగి ఇచ్చెయ్యి. అందరితో స్నేహంగా ఉండు'' అన్నాడు.

''సరే''

''మొదట్లో కొత్తగా ఉంటుంది కానీ నెమ్మదిగా అలవాటైపోతుంది. అమ్మతో రోజూ మాట్లాడు. నాకు ఏ టైం కైనా మెసేజ్ చెయ్యచ్చు. ఏమైనా హెల్ప్ కావాలంటే ఆలస్యం చెయ్యకుండా వెంటనే నాకు ఫోన్ చెయ్యి''

"సరే"

"రేపు లాండ్ అవ్వగానే నాకు మెసేజ్ చెయ్యి"

"సరే"

టీ పూర్తి చేసి పడుకున్నాను. రాత్రంతా కలత నిద్ర, పిచ్చికలలు. పొద్దున లేవగానే ఎంతో దిగులుగా అనిపించింది. అతి కష్టం మీద ఏడుపు ఆపుకుని, అన్నయ్యతో రెండు మూడు పదాలకన్నా ఎక్కువ మాట్లాడలేకపోయాను. జాగ్రత్తలు చెప్తూ నా సూట్‌కేస్‌లని చెకిన్ చేసాడు.

ఎంతో కష్టం మీద ఏడుపు ఆపుకుని సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్ళాను. ఆ తరవాత నా ప్రమేయం లేకుండా ఏడుపు ఏకధాటిగా వచ్చింది. అలా ఏడుస్తూనే విమానం ఎక్కి నా సీటులో కూర్చున్నాను. ఎవరూ నాతో మాట్లాడేందుకు వీలులేకుండా విమానం దిగేంత వరకు కళ్ళు మూసుకునే ఉన్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story